ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 33.0
కనిష్ఠం 23.4
సూర్యాపేట
5
మంగళవారం 8 అక్టోబరు 2024

కుమారుడిని చంపి
తల్లి ఆత్మహత్య
కొంతకాలంగా మానసిక రుగ్మతతో సతమతం
●7లో..
బ్యాంకు అధికారులమని బురిడీ
● తక్కువ వడ్డీకి రుణాల పేరుతో మోసం



సీఎంఆర్ పర్సంటేజీ తగ్గించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రైస్‌మిల్లర్ల సంఘం నాయకులు (ఫైల్)

సన్నధాన్యం కొనుగోళ్లపై తకరారు

- సీఎంఆర్ పర్సంటేజీని 60శాతానికి తగ్గించాలంటున్న మిల్లర్లు
- లేదంటే చేయలేమని చేతులెత్తేస్తున్న వైనం
- వారంలో నూతన విధానం ప్రకటించకుంటే కొనుగోళ్లకు ఆటంకాలే
- చర్చించి విధానాన్ని ఖరారు చేసే యోచనలో ప్రభుత్వం

సన్నధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ విధానం ఖరారవ్వకపోవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది నుంచి సన్నధాన్యాన్ని కూడా సీఎంఆర్ (కస్టమ్‌మిల్లింగ్ రైస్)కు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎంఆర్‌పై ఇప్పటివరకు ఉన్న విధానం ప్రకారం తాము బియ్యం ఇవ్వలేమని, సన్నధాన్యానికి నూతన విధానాన్ని ఏర్పాటుచేయాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మిల్లర్లు ప్రభుత్వానికి ఇప్పటికే వినతిపత్రాలివ్వగా, దీనిపై పౌరసరఫరాలశాఖాధికారులు, వ్యవసాయాధికారులు, మిల్లర్లతో ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. దసరా నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని నిర్ణయించినా, నూతన విధానం ఖరారవ్వకపోతే మిల్లర్లు సన్నధాన్యం కొనేదిలేదని చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వ నిర్ణయం కోసం అధికారులు, మిల్లర్లు, రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ వారంలో ప్రభుత్వం సన్నధాన్యం కొనుగోళ్లపై స్పష్టమైన విధానం ప్రకటించకపోతే ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఏర్పడనున్నాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

గత ఏడాది సీఎంఆర్ ఇంకా పెండింగ్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత వానాకాలం, యాసంగి సిజన్‌లో సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యానికి సంబంధించి బియ్యం ఇంకా ప్రభుత్వానికి రావాల్సి ఉంది. నల్లగొండ జిల్లాలో వానాకాలంలో 13,833 మెట్రిక్ టన్నుల పెండింగ్‌లో ఉండగా, ఈ నెలాఖరులోగా అందజేయాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో మిల్లర్లకు అధికారులు సూచించారు. యాసంగిలో 77,663 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావల్సి ఉంది. ఈ బియ్యాన్ని సైతం నెలాఖరులోగా అందించాలని గడువు విధించారు. సూర్యాపేట జిల్లాలో సీఎంఆర్ బియ్యం ఇవ్వడంలో కొందరు మిల్లర్లు నిర్లక్ష్యం వహించడంతో ఆ మిల్లులను అధికారులు బ్లాక్‌లిస్టులో పెట్టారు. వానాకాలంలో 64 మిల్లులకు ధాన్యం సీఎంఆర్ కేటాయించగా 1,00,083 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావాల్సి ఉంది. ప్రధానంగా 10 మిల్లులు బియ్యం ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ధాన్యం విక్రయించిన ఘటనలు వెలుగులోకి రావడంతో ఆ మిల్లులను డిఫాల్టర్లుగా ప్రకటించి కేసులు కూడా నమోదు చేశారు. యాదాద్రి జిల్లాలో వానాకాలం సీజన్‌లో 47 రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయించగా, 26,334 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది. యాసంగిలో 1,10,712 మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్‌లోఉంది. మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం కేటాయించడంతో మిల్లింగ్‌లో జాప్యం జరిగిందని, అందువల్లే సకాలంలో సీఎంఆర్ ఇవ్వలేకపోయామని మిల్లర్లు చెబుతున్నారు.

పర్సంటేజీని 60 శాతానికి తగ్గించాలని కోరుతున్న మిల్లర్లు

సన్నధాన్యం మిల్లింగ్ నిబంధనలు మార్చాలని రైస్‌మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు అమలులో ఉన్న పాలసీ ప్రకారం బియ్యం ఇవ్వలేమని చేతులెత్తేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం సన్నధాన్యం సీఎంఆర్‌కు ఇస్తే క్వింటా ధాన్యానికి వానాకాలంలో అయితే పచ్చిబియ్యం 67కిలోలు, యాసంగిలో అయితే బాయిల్డ్ రైస్ 68కిలోల చొప్పున ప్రభుత్వానికి అందజేయాలి. ఇది తమకు నష్టమని మిల్లర్లు చెబుతున్నారు. వానాకాలం సీజన్‌లో వచ్చే బియ్యాన్ని ప్రభుత్వరంగసంస్థలు 17శాతం తేమతో కొనుగోలు చేస్తాయని, ఆ బియ్యాన్ని మిల్లింగ్ చేస్తే 60శాతానికి లోపే పచ్చి బియ్యం వస్తుందని, దీని ప్రకారం 60శాతం బియ్యమే ఇచ్చేలా నిబంధన మార్చాలని మిల్లర్లు కోరుతున్నారు. బాయిల్డ్ రైస్‌లోనూ అదే తేడా వస్తోందని, ఆ మేరకు సడలించాలని కోరుతున్నారు. దొడ్డురకాల ధాన్యం మిల్లింగ్ చేస్తే 64శాతానికి మించి బియ్యం రావడం లేదని, ఈ మేరకు సీఎంఆర్ 64శాతానికి కుదించాలని కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవపరిస్థితిని తెలుసుకొని నూతన విధానాన్ని ప్రభుత్వం ప్రకటిస్తే తప్ప తాము మిల్లింగ్ చేయలేమని మిల్లర్లు పేర్కొంటున్నారు.

టెస్ట్‌మిల్లింగ్ మిల్లింగ్ చేయాలంటున్న మిల్లర్లు

సీఎంఆర్ పర్సంటేజీ తగ్గించాలనే విషయంలో మిల్లర్ల డిమాండ్‌ను పరిశీలించేందుకు నిపుణుల కమిటీతో టెస్ట్‌మిల్లింగ్ చేయించాలని మిల్లర్లు సూచిస్తున్నారు. మిల్లులో సన్నధాన్యాన్ని శాంపుల్స్ తీసుకొని మిల్లింగ్ చేసి ఏ మేరకు బియ్యం వస్తుందో నిర్ధారించాలని కోరుతున్నారు. ఆ తరువాతే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సీఎంఆర్‌ను ఖరారు చేయాలని పేర్కొంటున్నారు.

వానాకాలంలో సీఎంఆర్ ఇలా..

జిల్లా	మిల్లులు	అప్పగించిన ధాన్యం	రావాల్సిన బియ్యం	వచ్చిన బియ్యం	పెండింగ్ (మెట్రిక్ టన్నులు)
నల్లగొండ	240	3,22,754	2,17,577	2,03,744	13,833
సూర్యాపేట	64	2,08,113	1,39,436	39,352	1,00,083
యాదాద్రి	47	2,65,197	1,77,682	1,51,348	26,334

యాసంగిలో సీఎంఆర్ ఇలా..

జిల్లా	అప్పగించిన ధాన్యం	రావాల్సిన బియ్యం	వచ్చిన బియ్యం	పెండింగ్ (మెట్రిక్ టన్నులు)
నల్లగొండ	3,26,021	2,21,569	1,43,906	77,663
సూర్యాపేట	3,61,445	2,07,639	-	-
యాదాద్రి	2,70,6365	1,81,326	71,154	1,10,712

ధరల దడ

- పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు
- పెరిగిన ఉల్లి, ఎల్లిగడ్డ,కూరగాయల రేటు



రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు చిన్న, మధ్యతరగతి వర్గాలకు దడపుట్టిస్తున్నాయి. సంపాదన మూరేడు, ఖర్చులు బారెడు చందంగా పరిస్థితులు మారాయని ఆయా వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. కుటుంబమంతా పనిచేసినా పెరుగుతున్న నిత్యావసర ధరలు మధ్యతరగతి జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. - కోదాడ

కూరగాయల ధరలు ఇలా..

కూరగాయ	నెలక్రితం ధర (కిలో)	ప్రస్తుతం ధర (రూ.)
చిక్కుడు	120	80
టమాటా	30	80
ఆలుగడ్డ	30	60
దొండ	30	80
వంకాయ	40	80
దోస	60	60
బెండకాయ	20	50
మిర్చి	50	60
బీరకాయ	40	80
కాకరకాయ	40	80
గోరుచిక్కుడు	60	60



మధ్యతరగతి ప్రజలకు నెలనెలా వచ్చే ఆదాయానికి ఖర్చు తో పొంతన కుదరడం లేదు. పొద్దటి నుంచి సాయంత్ర వరకు తీరికలేకుండా పనిచేసినా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకురావడం భారంగా మారింది. పెరిగిన ఉల్లి, పంచదార, బియ్యం ధరలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. గత నెల కిలో సాంబమసూరి బియ్యం ధర రూ.53 ఉం టే, ప్రస్తుతం రూ.65కు పెరిగిం ది. పంచదార కిలో రూ.40 ఉండగా, రూ.50కి పెరిగింది. నెలవారీ ఖర్చులు చూసి కళ్లు తేలేసే పరిస్థితి నెలకొందని మ హిళలు వాపోతున్నారు. పెరిగిన నిత్యావసర వస్తువు ల ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

మంటపుట్టిస్తున్న కూరగాయల ధరలు

కూరగాయల ధరలు సైతం నిత్యావసరాల మాదిరిగానే మంటపుట్టిస్తున్నాయి. గత నెల టమాటా కిలో రూ.30 ఉంటే ప్రస్తుతం రూ.80కి పెరిగింది. చిక్కుడు ధర రూ.80 ఉండగా, రూ.120కి చేరింది. కోదాడ మునిసిపాలిటీ జనాభాకు అనుగుణంగా నిత్యం 15వేల కిలోల టమాటా, మిర్చి 3,500కిలోలు, వంగ 2,100, దోస 2,800, కాకర 2,100, గోకర 1,400, ఆలుగడ్డలు 4,200, చిక్కుడు 1,400 కిలోలు, మొత్తంగా 32,500 కిలోల కూరగాయలు అవసరం. వీటికి ఆకుకూరలు అదనం. అయితే దిగుబడి తగ్గి, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేక కూరగాయాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వర్షాకాలంలో కిలో టమాటా రూ.30కి రావాల్సి ఉండగా, దీనికి మూడు రెట్లు ధర పెట్టి కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు ఇలా..

నిత్యావసర వస్తువు	నెలక్రితం ధర (కిలో)	ప్రస్తుతం ధర (రూ.)
బియ్యం	53	65
నూనె	112	135
కొబ్బరిపొడి	200	320
పంచదార	40	50
ఉప్మా రవ్వ	20	30
గోధుమరవ్వ	40	50
కందిపప్పు	170	185
పెసరపప్పు	70	90
శనగపప్పు	50	70
ఉల్లిగడ్డ	50	70
ఎల్లిపాయలు	360	440
ఇడ్లీ రవ్వ	30	40
గుడ్లు (30)	120	145



జేబులు ఖాళీ అవుతున్నాయి

రూ.1,000 తీసుకెళ్తే నాలుగైదు సరుకులకు మించి రావడం లేదు. జేబు ఖాళీ అవుతందే తప్ప నెలకు సరిపడా సరుకులు కొనుగోలు చేయలేకపోతున్నాం. ధరల పెరుగుదలపై ప్రభుత్వం దృష్టి సారించి నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

-దినేష్, వినియోగదారుడు, కోదాడ

నెలకు రూ.20వేలు ఖర్చు

నాలుగునెలల క్రితం నెలకు సరిపడా సరుకులకు రూ.10వేలు ఖర్చయ్యేది. ప్రస్తుతం రూ.20వేలు ఖర్చు చేసినా సరుకులు రావడం లేదు. పెరిగిన ధరలతో ఇంటికి నెలకు సరిపడా పూర్తిస్థాయిలో సరుకులు, కూరగాయలు తెచ్చుకోలేపోతున్నాం. ధరల పెరుగుదలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- సులోచన, గృహిణి, కోదాడ

సూర్యాపేట మునిసిపాలిటీకి
అంతర్జాతీయసంస్థ ప్రశంస



ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన వస్తువులను ప్రదర్శిస్తున్న మునిసిపల్ అధికారులు

సూర్యాపేట టౌన్, అక్టోబరు 7 : పర్యావరణ పరిరక్షణకు గాను సూర్యాపేట మునిసిపాలిటీకి అంతర్జాతీయ ప్రశంస లభించినట్లు మునిసిపల్ కమిషనర్ బీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన 4వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ సదస్సులో ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులను అధికారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమాటిక్స్ చైర్మన్, డాక్టర్ కే మృత్యుంజయరెడ్డి, సెక్రటరీ విజయలక్ష్మిలు సూర్యాపేట మునిసిపల్ ఆధ్వర్యంలో తయారుచేసిన ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్‌తో తయారుచేసిన సింగిల్‌యూజ్ టైల్స్ బ్రిక్స్ ఆక్యుప్రెషర్ మ్యాట్స్‌ను పరిశీలించి అభినందించినట్లు మునిసిపల్ కమిషనర్ తెలిపారు. సదస్సులో డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, అడిషనల్ మేనేజర్ జీ సురేష్, సూర్యాపేట మునిసిపాలిటీ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సీహెచ్ శివప్రసాద్, శాస్త్రవేత్తలు, పరిశోధనకారులు, విద్యార్థులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీజేఎస్ నాయకులు

సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 7 : మండలాల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజలు అందించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ బయోమెట్రిక్ హాజ రు నమోదు చేసుకోవాలన్నారు. లేని యెడల సంబంధిత జిల్లా అధికా రి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రజావాణికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. వచ్చిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమం లో డీఆర్‌డీవో అప్పారావు, డీపీవో నారాయణరెడ్డి, డీఏవో శ్రీధర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ కోటాచలం, డీటీడీవో శంకర్, ఏవో సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

సూర్యాపేటలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలి

సూర్యాపేట పట్టణంతో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ కోరారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ధర్మార్జున్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకంలోని లోపాల వల్ల పట్టణ ప్రజలకు మంచినీరు సరఫరా కావడం లేదన్నారు. ఇమాంపేట వద్ద గల ఫిల్టర్ బెడ్ నుంచి రోజు 21 ఎంఎల్‌డీ లీటర్ల నీరు సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 16 ఎంఎల్‌డీల నీరు మాత్రమే సరఫరా చేస్తున్నారని తెలిపారు. దీని వల్ల పట్టణ ప్రజలకు నీరు సరఫరా కావడం లేదన్నారు. మిషన్ భగీరథ పథకం ఏర్పాటు సమయంలో 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణ జనాభాను అంచనా వేశారని ప్రస్తుతం లక్షా 80వేలకు చేరిందన్నారు. దాంతో సరఫరా చేసే నీరు సరిపోవడం లేదన్నారు. ఇమాంపేట ఫిల్టర్ బెడ్ వద్ద ఉన్న మూడో మోటారును కూడా వినియోగంలోకి తెచ్చి ప్రతి రోజు నీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్, నాయకులు గోపి, చంద్రకాంత్, వినయ్‌గౌడ్, అనిల్, ఫరీదొద్దిన్, సతీష్, వంశీ, కిశోర్ ఉన్నారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపన నిలిపివేయాలి

తుంగతుర్తి : ఈనెల 11న తిరుమలగిరిలోని తొండ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిలిపివేయాలని బీఆర్ఎస్ నాయకులు సోమవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు తడకమళ్ల రవికుమార్ మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రం విద్య, వైద్య, రవాణా రంగాల్లో వెనుకబాటుకి గురైందని ఎన్ని ప్రభుత్వాలు మారినా తలరాత మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ కేంద్రానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసిందని స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రభుత్వ భూమి లేదనే సాకుతో తొండ తిరుమలగిరిలో నిర్మించడానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. మండలంలోని కరివిరాల కొత్తగూడెం గ్రామంలో 365 జాతీయ రహదారి అనుకొని 20 నుంచి 30ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. దాంతో కలెక్టర్ స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంఓ నాయకులు బొంకూరు మల్లేష్, కొండగడుపుల వెంకటేష్, తడకమళ్ల మల్లికార్జున్, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం విరాళాలు



ఎమ్మెల్యే పద్మావతికి విరాళం అందజేస్తున్న సహకార సంఘాల చైర్మన్లు

కోదాడరూరల్,అక్టోబరు 7: ఇటీవల భారీ వర్షాలతో నిర్వాసితులైన వారికి కోదాడ నియోజకవర్గంలో సహకార సంఘాల చైర్మన్లు ఆర్థికసాయం ప్రకటించారు. ఒక్కొక్కరు రూ.10వేల చొప్పున రూ.లక్షచెక్కును సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వరదలతో కోదాడ, చిలుకూరు, నడిగూడెం మండలాలకు తీవ్రనష్టం జరిగిందన్నారు. అక్కడ ఇళ్ళు కూడా కూలిపోయాయని, బాధితులను ఆదుకునేందుకు తమవంతు సహకారంగా డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు విరాళం అందించామన్నారు. కార్యక్రమంలో నల్లగొండ డీసీసీబీ డైరెక్టర్ కొండా సైదయ్య, చిమిర్యాల చైర్మన్ కొత్తా రఘుపతి, కాపుగల్లు చైర్మన్ నంబూరి సూర్యం, కోదాడ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, యర్రవరం చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, బేతవోలు చైర్మన్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్ తండ్రి పురుషోత్తంరెడ్డి మృతికి సంతాపం తెలుపుతూ ఉత్తమ్‌ను పరామర్శించారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించాలి



దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

సూర్యాపేట, అక్టోబరు 7 : గత సంవత్సర కాలంగా పాలస్తీనా పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు మల్లు నాగార్జున రెడ్డి, బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను నిరసిస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. 2023 అక్టోబరు 7 నుంచి పాలస్తీనా పై యుద్ధం చేస్తున్న ఇజ్రాయిల్ చిన్నారులు, మహిళలను, అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని వైమానిక భూతల దాడులు జరుపుతున్నారని వారు పేర్కొన్నారు. సామాన్య ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. పాఠశాలలు, ఆసుపత్రులు, మసీదులపై ఇజ్రాయిల్ సైనిక బలగాలు దాడులకు పాల్పడుతూ పెద్ద ఎత్తున మారణ హోమాన్ని సృష్టిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనా పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులపై ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోకుండా అమెరికా వత్తాసు పలికే విధంగా వ్యవహరించడం తగదన్నారు. అమెరికా సైనికంగా, ఆర్థికంగా ఇజ్రాయిల్‌కు సహాయం అందిస్తూ దాడులకు ఆజ్యం పోస్తుందని వారు పేర్కొన్నారు. అనంతరం ఇజ్రాయిల్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గంట నాగయ్య, ఎం సీపీఐయూ జిల్లా కార్యదర్శి నజీర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, బూర వెంకటేశ్వర్లు, చెరకు ఏకలక్ష్మి, దండా వెంకటరెడ్డి, వేల్పుల వెంకన్న, వీరబోయిన రవి యాదవ్, ధనుంజయ్ నాయుడు, కంబాలపల్లి శ్రీనివాస్, సృజన, అనంతుల మల్లేశ్వరి, వెల్పుల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న ధూళిపాళ ధనుంజయనాయుడు

సూర్యాపేట టౌన్, అక్టోబరు 7 : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి ఆదుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో జరిగిన తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా కన్వీనర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక ఫెడరేషన్‌కు వెంటనే పాలక మండలి ఏర్పాటు చేసి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలన్నారు. రజకుల భద్రత చట్టాన్ని రూపొందించి అమలు చేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి రజక వృత్తిదారులకు రూ.5వేల పింఛను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సింహాద్రి, యాదగిరి, రాము, రాజు, శ్రీను, బూర వెంకటేశ్వర్లు, వెంకట్, వెంకన్న, నాగమ్మ పాల్గొన్నారు.

కలుషిత నీటితోనే అతిసార

మేళ్లచెర్వు, అక్టోబరు 7 : చింతలపాలెం మండల కేంద్రంలోని బొడ్రాయిబజార్‌లో ఒక ట్యాంక్ ద్వారా వచ్చే కలుషిత నీటి ద్వారానే ఆ ప్రాంతంలో అతిసార వ్యాప్తిచెందిందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నిరంజన్ అన్నారు. గ్రామంలో పరిస్థితి అదుపులో ఉందని, నూతనంగా కొత్త కేసులు నమోదు కాలేదన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ఆదివారం వ్యాధి లక్షణాలతో ఆసుపత్రిలో చేరిన వారి పరిస్థితి మెరుగుపడతుందన్నారు. వ్యాధి ప్రబలిన ప్రాంతంలోని తాగునీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించామన్నారు. వాటర్ ట్యాంకు, పైప్పులను పూర్తిస్థాయిలో మార్చాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. గ్రామాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు వైద్యశిబిరం కొనసాగిస్తామన్నారు. ఆయన వెంట మండల వైద్యాధికారి సీతామహాలక్ష్మీ, డాక్టర్ సచీన్, సీహెచ్‌వో వినోద్, వైద్య సిబ్బంది, సూరి, విజయ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా చైతన్యం కావాలి



ట్రైనింగ్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ చైతన్య

కోదాడ రూరల్, అక్టోబర్ 7 : మహిళలు ఆర్థికంగా చైతన్యం కావాలని మహిళా సాధికారిత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ చైతన్య అన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో మండలంలోని గుడిబండ గ్రామంలో కార్మికశాఖ ఏర్పాటు చేసిన శిక్షణలో ఆమె మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా చైతన్యం కావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థిక ప్రగతికి కల్పిస్తున్న అవకాశాలు, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అదేవిధంగా మహిళలకు హెల్ప్‌లైన్ నంబర్, చైల్డ్‌లైన్ నంబర్ 1098, సఖి 181 లపై, ఓల్డ్ ఏజ్ హెల్ప్‌లైన్ నంబర్ 14567 పై అవగాహన కల్పించారు. రుతుక్రమ సమయంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీస్ వర్క్ ట్రైనర్, ఇన్‌చార్జి కరుణ సాగర్, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రేవతి, వినోద్, తేజస్విని పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

● పోలీసుల అదుపులో నిందితుడు

చండూరు రూరల్, అక్టోబరు 7: చాక్లెట్లు కొనిస్తానని బాలికను దుకాణానికి తీసుకెళ్లిన ఓ యువకుడు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా చండూరు మండలంలో ఈ సంఘటన జరిగింది. చండూరు సీఐ వెంకటయ్య తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం తాపీ పని చేసేందుకు కొన్నేళ్ల క్రితం మండలంలోని ఓ గ్రామానికి వచ్చింది. ఆ దంపతులకు ఇద్దరు కుమార్తెలు కాగా, తల్లి అనారోగ్యంతో ఐదేళ్ల క్రితం మృతిచెందింది. దీంతో తండ్రి మరో వివాహం చేసుకుని హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇద్దరు బాలికలు(11, 8 సంవత్సరాలు) తాత, నానమ్మతో కలిసి గ్రామంలోనే ఉంటూ చదువుకుంటున్నారు. బాలిక తాత గ్రామంలో కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూలి పనులు చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం దేవరపాడు గ్రామం నుంచి వచ్చిన వాటుపల్లి బాబి(24) వారు ఉండే వీధిలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజులుగా బాలికల తాతతో పరిచయం పెంచుకుని రోజూ మద్యం తాగించేవాడు. అదే పరిచయంతో శనివారం రాత్రి వారి ఇంటికి వచ్చి బాలికల తాతకు మద్యం తాపించాడు. చాక్లెట్లు కొనిస్తానని బాలికను(8) సమీపంలోని ఓ దుకాణానికి తీసుకువెళ్లి తిరిగిరాలేదు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన బాలిక తనపై జరిగిన లైంగిక దాడి గురించి తాతకు చెప్పింది. ఆయన గ్రామంలో తెలిసిన వారికి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఉదయం బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు బాబిపై పోక్సో కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటయ్య తెలిపారు. బాలికను వైద్య పరీక్షలకు పంపనున్నట్లు తెలిపారు.

బ్యాంకు అధికారులమని రైతులకు బురిడీ

● తక్కువ వడ్డీకి రుణాల పేరుతో మోసం ● ఏడుగురు సభ్యుల అరెస్టు.. ఒకరు పరారీ ● జిల్లాలో 28మంది రైతుల నుంచి రూ. 26లక్షలు వసూలు

నల్లగొండ క్రైం, అక్టోబరు 7: బ్యాంకు అధికారులుగా చలామణి అవుతూ తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని రైతులు, వ్యాపారులను మోసం చేస్తోన్న ఏడుగురిని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రూ.1.65లక్షల నగదు, పలువురు రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలు, అగ్రిమెంట్ డాక్యుమెంట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ ముఠా సభ్యుల వివరాలు వెల్లడించారు.

వ్యవసాయం చేస్తూ నకిలీ ఫీల్డ్ ఆఫీసర్‌గా అవతారమెత్తి

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే షేక్ నజీర్‌కు పెద్దవూర మండలం వెలుగూడెంకు చెందిన కట్టెబోయిన పరమేష్, మిర్యాలగూడ మండలానికి చెందిన రాజేశ్, మాడ్గులపల్లి మండలం చిరుమర్తికి చెందిన కొండా శ్రీను, మిర్యాలగూడ బాపూజీనగర్‌కు చెందిన గోగుల సురేష్, మిర్యాలగూడ మండలం జప్తీవీరప్పగూడేనికి చెందిన చిలుముల సైదులు, పెద్దవూర మండలం తెప్పలమడుగుకు చెందిన పల్లెబోయిన నాగరాజు, నార్కట్‌పల్లి మండలం అంబేడ్కర్ కాలనీకి చెందిన ముప్పిడి సైదులు పరిచయమయ్యారు. వీరు ఆయా బ్యాంకుల్లో ఫీల్డ్ ఎంక్వైరీ అధికారులమని నమ్మించి రైతులు, వ్యాపారస్తుల వద్దకు వెళ్లి తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయిస్తామని చెప్పేవారు. భూములు సర్వే చేసి అవసరమైన డాక్యుమెంట్లు సిద్ధం చేసేవారు. ముందస్తుగా రైతులు, వ్యాపారుల నుంచి కొంత నగదును తీసుకునేవారు. వాటి గురించి అడిగినప్పుడు ఏదో సాకు చెప్పి దాట వేస్తూ రుణాలు ఇప్పించకుండా తప్పించుకు తిరుగుతున్నారు. జిల్లాలోని పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), నిడమనూరు, నేరేడుగొమ్ము, దేవరకొండ, పీఏపల్లి మండలాల్లో 28మంది రైతులు, హాలియాలో ఓ వ్యాపారికి సాంఘిక సంక్షేమ శాఖల నుంచి నుంచి అధిక మొత్తంలో రుణం ఇప్పిస్తామని చెప్పి అందరినుంచి రూ.26లక్షల నగదు వసూలుచేశారు.



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్, నగదు, పట్టాదారు పాసుపుస్తకాలు, అగ్రిమెంట్ డాక్యుమెంట్లు స్వాధీనం

అనుమానాస్పదంగా తిరుగుతూ..

సోమవారం పెద్దవూర పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ముఠా సభ్యులు అనుమానంగా కనిపించడంతో పెద్దవూర ఎస్ఐ వీరబాబు తన సిబ్బందితో విచారించగా చేసిన నేరాలను అంగీకరించారు. వీరిలో షేక్ వజీర్ పరారీలో ఉన్నారు. సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, నాగార్జునసాగర్ సీఐ బీసన్న, పెద్దవూర ఎస్ఐ వీరబాబు, సిబ్బంది ఉన్నారు. నిందితుల నుంచి రూ.1.65లక్షల నగదు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, అగ్రిమెంట్ డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.26లక్షలు నగదు వసూలు చేయగా, మిగిలిన మొత్తం ఎలా ఖర్చుచేశారనే దానిపై వివరాలు సేకరిస్తున్నారు.

లింగాలగూడెంలో క్షుద్రపూజల కలకలం

కనగల్, అక్టోబరు 7: నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని లింగాలగూడెం గ్రామంలో సోమవారం క్షుద్రపూజలు కలకలం సృష్టించాయి. గ్రామానికి చెందిన బొబ్బలి నర్సింహ, గన్నెబోయిన వెంకన్న ఇళ్లలో ఆదివారం అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. సోమవారం ఉదయం మూటలను గమనించి విప్పిచూడగా అందులో పసుపు,కుంకుమలు, జీడిగింజలు, గవ్వలు, నిమ్మకాయలు, పేపర్‌పై రతిగీసినబొమ్మలు, తాటిఆకులతో చేసినబొమ్మలు, నిమ్మకాయలు తదితర వస్తువులు కన్పించాయి. దీంతో గ్రామస్థులు భయందోళనకు లోనయ్యారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. రెండు నెలల క్రితం ఓసారి, పదిరోజుల క్రితం మరోసారి ఇదేరీతిలో క్షుద్రపూజలు చేసిన వస్తువులు పడేసివెళ్లినట్లు వివరించారు.

ఈ విషయమై ఎస్ఐ విష్ణుమూర్తిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా క్షుద్రపూజల పేరుతో గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. గ్రామంలో క్షుద్రపూజలు, బాణమతి, బాల్యవివాహాలు తదితర సామాజిక రుగ్మతులపై పోలీస్‌శాఖ తరుఫున కళాజాతా కార్యక్రమాలను నిర్వహించి గ్రామస్థులు చైతన్య పరుస్తామని ఆయన వివరించారు.



కుమారుడిని చంపి.. తల్లి ఆత్మహత్య

● కొంతకాలంగా మానసిక రుగ్మతతో సతమతం ● యాదాద్రిభువనగిరి జిల్లాలో ఘటన



సోని, రేయాన్స్(ఫైల్)

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 7: మానసికస్థితి సరిగా లేని ఓ తల్లి కుమారుడిని చంపి, తానూ ఆత్మహత్య చేసుకుంది. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ కె.భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జడల రాజు యాదవ్‌కు అదే గ్రామానికి సోని(29)తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. రాజు స్టేజీ డెకరేషన్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా సోని అనారోగ్యంతో బాధపడుతోంది. మానసిక రుగ్మతతో (తనకు భయం వేస్తోందని, బుగులుగా ఉంటోందని వెళ్లేది) తరుచూ తల్లిగారింటికి వెళ్తుండేది. మూడు రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్లి ఆదివారం వచ్చింది. సోమవారం ఉదయం భర్త రాజు పనిపై బయటకు వెళ్లాడు. అత్తామామలు కూడా పని నిమిత్తం బయటికి వెళ్లారు. ఇంట్లో సోని తన ఇద్దరు కుమారులు చింటు(7), రేయాన్స్(5)తో ఉంది. పని ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన రాజుకు గదిలో రేయాన్స్ అచేతనంగా పడి ఉండడాన్ని కిటికీలోనుంచి గమనించాడు. ఫ్యాన్‌కు సోని వేలాడుతుండడాన్ని చూసి ఇరుగుపొరుగు సహాయంతో ఇద్దరినీ భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారిద్దరూ మృతిచెందారని డాక్టర్లు నిర్ధారించారు. పెద్ద కుమారుడు చింటును స్నేహితులతో ఆడుకోవాలని చెప్పి బయటికి పంపటంతో తల్లి, రేయాన్స్‌లు ఇద్దరే ఇంటి వద్ద ఉన్నారు. గదిలోకి వెళ్లి తలుపునకు గడియ పెట్టిన అనంతరం రేయాన్స్‌ను గొంతు నులిమి చంపి, ఆ తర్వాత ఆమె కూడా ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు కుటుంబసభ్యులు గుర్తించారు. మృతదేహాలను భువనగిరి ఏరియా పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి మార్చురీలో ఉంచారని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. సోని, రాజు దంపతులు అన్యోన్యంగా ఉండేవారని, ఎలాంటి గొడవలు లేకుండా ఉన్నారని స్థానికులు తెలిపారు. తరుచూ తనకు భయంవేస్తోందని అక్కడక్కడా చూపించుకొనేదని వారు తెలిపారు.

కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది..

బీబీనగర్: కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచుకుంద గ్రామానికి చెందిన జీలిగే సునీల్(34) 15 సంవత్సరాల క్రితం కుటుంబంతో సహా బీబీనగర్ పట్టణానికి వలస వచ్చి గోళి నరేందర్‌రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో కూలిగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతూ జీవితంపై విరక్తి చెంది మనస్తాపంతో ఆదివారం ఇందిరమ్మ కాలనీలో అద్దె ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సునీల్ సోదరుడు సంజీవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతూ..

అడవిదేవులపల్లి: నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని మొల్కచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని బాలాజీతండాలో ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీతండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రమావత్ తుల సీరాం భార్య వాలి(27) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. తన వల్ల కుటుంబసభ్యులు ఇబ్బందులు పడుతున్నారని మానసిక ఆవేదనకు గురై ఇంట్లో ఎవరూ గమనించని సమయంలో సోమవారం తెల్లవారుజామున ఇంట్లో పైకప్పుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం నిద్రలేచి చూసిన కుటుంబసభ్యులు వాలి ఉరి వేసుకొని ఉండడాన్ని గమనించి స్థానికు సహాయంతో వెంటనే కిందికి దించి పరిశీలించారు. అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వాలి తండ్రి వస్రాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చివ్వెంల, అక్టోబరు 7: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని గుంపుల గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుంపుల గ్రామానికి చెందిన మట్టపల్లి సందీప్(23) తన తండ్రి శ్రీనుయాదవ్‌కు అనారోగ్యంగా ఉండడంతో తన మోటారు సైకిల్‌పై తండ్రిని తీసుకొని సూర్యాపేటకు వెళ్లి ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద దింపాడు. తిరిగి బైక్‌పై ఇంటికి వస్తుండగా మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గుంపుల గ్రామం వద్ద గల యూటర్న్ తీసుకుంటున్న సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న కారు సందీప్ బైక్‌ను ఢీకొంది. దీంతో సందీప్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సందీప్ తండ్రి శ్రీనుయాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సందీప్ మృతదేహం



మహాలక్ష్మీ అలంకరణలో దుర్గాదేవి



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, అక్టోబరు 7: దేవి శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శ్రీపార్వతవర్ధిని అమ్మవారు మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. కొండపైన శివాలయంలో వైభవంగా కొనసాగుతున్న ఉత్సవ వేడుకల్లో సోమవారం ఐదోరోజు అమ్మవారికి పూజారులు ప్రత్యేకంగా రూ.3,700 నగదు మాలతో (రూ.200, రూ.100 నోట్లు) అలంకరించారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, అర్చనలు, పారాయణాలు, గాయత్రి జపాలు, లలిత సహస్రనామార్చనలు మధాహ్నం పూజ నీరాజన మంత్ర పుష్పాలు అర్పించారు. సాయంత్రం నవావరణ పూజ, సహస్రనామార్చన నీరాజనం, మంత్ర పుష్పములు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

హరిహరులకు పూజలు

స్వామివారి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పార్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సంధ్య వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటిక మూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయన ఖజానాకు రూ. 18,79,262ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 7: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట నల్లచెరువులో సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక నల్లచెరువులో సోమవారం ఉదయం కుళ్లిపోయిన పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహంపై నలుపురంగు జీన్‌ప్యాంట్ ఉందని, ఎడమ చేతిపై 'ఎమ్మెల్యే' అని రాసి ఉంది. రెండు చెవులకు రింగులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇసుక డంపులు సీజ్



ఇసుక డంపులు పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 7: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి గ్రామ శివారులో కొందరు ఏరు నుంచి ఇసుక తరలించి సమీపంలో ఉన్న వ్యవసాయ భూముల్లో ఇసుక డంపులు ఏర్పాటు చేస్తున్నారు. వీటిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలకు రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించారు. ఇసుక డంపులను సోమవారం పరిశీలించి సీజ్ చేశారు. అనంతరం గ్రామపంచాయితీ పోలీసులకు, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్ఐ ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ ఇసుక డంపు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేషన్ బియ్యం ఉన్నాయని సమాచారంతో..

చివ్వెంల, అక్టోబరు 7: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి గ్రామంలోని ఓ దాబాలో రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు సమాచారంతో పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దురాజ్‌పల్లి సమీపంలోగల రేణుక ఫ్యామిలీ దాబాలో రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. మండలంలోని కోటినాయక్‌తండాకు చెందిన శేషులాల్ నిల్వ ఉంచిన బియ్యం రేషన్ బియ్యమని ఆరోపణలు రావడంతో నిర్ధారించేందుకు సివిల్‌సప్లయ్ అధికారులు సమాచారం ఇవ్వడంతో అధికారులు బియ్యాన్ని పరిశీలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పీడీఎస్ బియ్యం కావని ప్రాథమిక విచారణలో తెలిపారు. రేషన్ బియ్యమా కాదా అని నిర్ధారించడానికి పట్టుబడిన బియ్యం నమూనాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష

ఆలేరు రూరల్, అక్టోబరు 7: ఆయుధాలతో ఇతరులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరికి భువనగిరి అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. ఆలేరు ఎస్ఐ రజినికర్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా పాల్వంచ మండలంలోని వెంగళరావుకాలనీకి చెందిన రాంబాబు ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ దిల్‌సుఖ్‌నగర్‌లోని ద్వారాకాపురి కాలనీ నివాసముంటున్నాడు. వరంగల్ జిల్లా కేసముద్రం మండలంలోని మహమూద్‌పట్నం గ్రామానికి చెందిన శ్రీనివాస్ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. 2011 సంవత్సరంలో బైక్‌పై వెళ్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు ఆలేరు వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఇద్దరి వద్ద అక్రమ ఆయుధాలు రెండు(పిస్టల్స్)ను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి ఎస్ఐ ఎన్. వెంకటేశ్వర్లు నిందితులపై ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి యాదగిరిగుట్ట సీఐ కె. కృష్ణ కిషోర్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీట్ నమోదు చేశారు. కేసు విచారించిన భువనగిరి అసిస్టెంట్ సెషన్ జడ్జి ఇద్దరు నేరస్థులకు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రాష్ట్రానికి 33.88లక్షల ఇళ్లు కేటాయించాలి

● స్టాండింగ్ కమిటీ సమావేశంలో భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, అక్టోబరు 7: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అతి తక్కువ ఇళ్లను కేటాయించి తీరని అన్యాయం చేసిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో తొలిసారి జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు 21.37లక్షలు, ఉత్తరప్రదేశ్‌కు 17.76లక్షలు, మహారాష్ట్రకు 13.64లక్షలు, గుజరాత్‌కు 13.64లక్షల ఇళ్లు మంజూరు చేసి, తెలంగాణకు కేవలం 1.58లక్షల ఇళ్లు మాత్రమే మంజూరు చేసి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన కోటా కోసం ఏనాడూ పోరాడలేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో అర్హులైన పేదలను గుర్తించిందన్నారు. వచ్చే ఐదేళ్లలో కోటి ఇళ్లు నిర్మించేందుకు కేంద్ర యోచిస్తున్న తరుణంలో ఇప్పటి వరకు 33.88లక్షల ఇళ్లు అవసరముండగా, తెలంగాణకు ఈ ఏడాది ఆరు లక్షల ఇళ్లు కేటాయించాలన్నారు. అదేవిధంగా హైదరాబాద్ రాజధాని 50కిలోమీటర్ల మేర విస్తరించగా మెట్రోతో పాటు ఇతర రవాణ వ్యవస్థల సదుపాయం లేక ట్రాఫిక్ సమస్యలు తరుచూ తలెత్తుతున్నాయన్నారు. గ్లోబల్‌తో పోటీ పడేందుకు ప్రయత్నించే సమయంలో రాష్ట్రాలను సమీక్షించి మద్దతు ఇవ్వాలన్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి నగరాల చుట్టు పంచాయతీలు వేగంగా పట్టణీకీకరణ జరిగి మునిసిపాలిటీలుగా ఆవిర్భవించాయన్నారు. అనధికార లేఅవుట్ల మూలంగా సరైన రోడ్లు, మంచినీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థ ప్రణాళికాబద్ధంగా లేవని ఎంపీ చామల పేర్కొన్నారు.



ఢిల్లీలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ చామల

పనిచేయని నిఘా నేత్రాలు

ఒక్క సీసీ కెమెరాల 100మంది పోలీసులతో సమానం. నేరగాళ్లపై నిఘా పెట్టడానికి, చోరీ కేసుల్లో నిందితులను పట్టుకోవడానికి సీసీ కెమెరాల ఫుటేజీ ముఖ్యం. అయితే మండల కేంద్రంలో నిఘా నేత్రాలు పనిచేయడం లేదు. మండలంలో దాతల సహకారంతో లక్షల రూపాయలతో ఆర్భాటంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అవి ఎక్కడా పనిచేయడంలేదు. కనీసం పోలీస్‌స్టేషన్‌లో కూడా పనిచేస్తున్న దాఖలాలు లేవు. మండలంలోని సూర్యాపేట ఖమ్మం జాతీయ రహదారిలో ఉన్న ప్రధాన గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలు పనిచేయనందున ఆశించిన లక్ష్యం నెరవేరడంలేదు. ●మోతె

నామవరం గ్రామానికి చెందిన దాత ఏడు సీసీ కెమెరాలను గ్రామపంచాయతీకి అప్పగించారు. అవి కొంతకాలం మాత్రమే పనిచేశాయి. ఉర్లుగొండలో కూడా ఇటువంటి పరిస్థితే ఉంది. మోతె తహసీల్దార్ కార్యాలయంలో దొంగలు పడుతున్నారని కార్యాలయానికి వెళ్లే రోడ్డులో గతంలో పనిచేసిన అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆ సీసీ కెమెరాలను ఎవరో చోరీ చేశారు. మామిళ్లగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడంలేదు. పోలీస్‌స్టేషన్ సమీపంలో స్తంభాలకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. మండల కేంద్రంలో రోడ్ల వెంబడి గతంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు ఇప్పుడు కనిపించడంలేదని స్థానికులు తెలిపారు.

ఈ ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు

మండలంలోని రాఘవాపురం క్రాస్‌రోడ్, మామిళ్లగూడెం అండర్‌పాస్, మోతె, హుస్సేనాబాద, తిరుపతమ్మ దేవాలయం మూలమలుపులో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ప్రమాదాల జరిగితే సమయంలో తప్పు ఎవరిదో గుర్తించడానికి ఆస్కారం ఉంటుందని స్థానికులు తెలిపారు.

మరమ్మతులు చేయించాలి

మండలంలోని నామవరం, ఉర్లుగొండ, మండల కేంద్రంలో ఉన్న సీసీ కెమెరాలు కొద్దిపాటి మరమ్మతులు వచ్చాయి.. వాటిని ఉపయోగంలోకి తీసుకువస్తే ఘటనలు జరిగినప్పుడు వెంటనే గుర్తించవచ్చని స్థానికులు చెబుతున్నారు. నిత్యం, ప్రమాదాలు, దొంగతనాలు జరగకుండా ఉండటానికి, నేరగాళ్లను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. నామవరంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గ్రామ పంచాయతీకి అప్పగించారు. వాటిని వినియోగంలోకి తీసుకురావాలి. రాత్రి పూట రోడ్ల వెంబడి కట్టేసిన గేదెలను ఆవులను కొందరు చోరీ చేసిఆటోల్లో తరలిస్తున్నారు. ఈ సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తే నేరగాళ్లను కట్టడి చేయడానికి ఆస్కారం ఉంది. పోలీస్ అధికారులు, గ్రామాల పెద్దలు కలిసి ఆయా గ్రామాల్లో దాతలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

సీసీ కెమెరాలకు మరమ్మతు చేయిస్తాం

మండలంలో దాతల సహకారంతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు మరమ్మతుకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం. మండల కేంద్రంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి ప్రధానకూడళ్లలో, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. రోడ్ల వెంబడి ఉన్న గ్రామాల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేస్తాం.

● యాదవేందర్‌రెడ్డి, ఎస్ఐ, మోతె



మోతె మండలం నామవరం బస్టాండ్ సెంటరులో పనిచేయని సీసీ కెమెరాలు

డీజేలపై నిషేధాన్ని ఎత్తివేయాలి



డీజేల నిషేధంపై శాంతియుత ర్యాలీ చేపట్టిన డీజే యజమానులు

కోదాడ టౌన్, అక్టోబరు 7: డీజేలపై నిషేధాన్ని ఎత్తివేయాలని పలువురు డీజే యజమానులు కోరారు. కోదాడ, హుజూర్‌నగర్, పాలేరు నియోజకవర్గాలలో ఉన్న డీజే యజమానులు సోమవారం కోదాడ పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కోదాడ డివిజన్ అధ్యక్షుడు అనంతు లింగస్వామి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో డీజేలను నిషేధించడంపై విచారణ వ్యక్తం చేశారు. డీజేలపై నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని, తమ పొట్టకూటి కోసం పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి డీజేలను పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తమ డీజే పాటలతో, తెలంగాణ రాష్ట్ర ప్రజలను చైతన్యం చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమను గుర్తించి డీజేల నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వేణు, ఓం శ్రీను, ఉపాధ్యక్షుడు వజీర్, కోశాధికారి బంగారు, తులస, కార్యదర్శి పండు, సిద్దు, జాని, గందు నరేష్, వివిధ మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు 300 మంది డీజే కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

తిరుమలగిరి, అక్టోబరు 7: ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని తహసీల్దార్ హరిప్రసాద్ కోరారు. ధాన్యం కొనుగోళ్లపై సోమవారం తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిషత్, వ్యవసాయ, వెలుగు, మెప్మా, పీఏసీఎస్, సీఎఫ్‌లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు అందుబాటులో ఉండేలా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం 'మన ఇసుక- మన ఊరు ఇసుక విధానం'పై ట్రాక్టర్‌ల యజమానులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, ఎంపీడీవో లాజర్, ఏవో నాగేశ్వరరావు, ఏపీఎం సైదయ్య పాల్గొన్నారు.

మండలంలో సమస్యలు పరిష్కరించాలి

పెన్‌పహాడ్, అక్టోబరు 7: మండలంలో సమస్యలను పరిష్కరించాలని టీఆర్‌వీ ఎస్సీ విద్యార్థి సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌వీ ఎస్సీ నాయకులు బంటు సందీప్, గుండు లక్ష్మీనారాయణ, మల్లేష్, నవీన్, సాయి, పాల్గొన్నారు.

సాయం అందించడంలో సంక్షేమ బోర్డు వైఫల్యం

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 7: భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను ఆదుకోవడంలో సంక్షేమ బోర్డు వైఫల్యం చెందిందని ఇఫ్టూ జిల్లా కమిటీ సభ్యుడు సామా నర్సిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాత సూర్యాపేట గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు సామర్థపు జానయ్య నిర్మాణ పనులు చేస్తుండగా, భవనంపై అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. జానయ్య కుటుంబ సభ్యులను నర్సిరెడ్డి పరామర్శించి రూ.8వేల ఆర్థికసాయం అందజేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సూరారపు వెంకన్న, వీరయ్య పాల్గొన్నారు.

ఉత్తమ్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్, అక్టోబరు 7: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హుజూర్‌నగర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఆయన నివాసంలో పరామర్శించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ తండ్రి పురుషోత్తమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులఅర్పించారు. ఈ కార్యక్రమంలో అమర్‌నాథ్‌రెడ్డి, హరిబాబు, కౌన్సిలర్లు మంజుల, ఫణికుమారి, జక్కుల వీరయ్య, నరేందర్, రామరాజు, వివిధ సంఘాల నాయకులు వెంకటేష్, మధు, రాజారమేష్, నరేష్, కృష్ణ, రామ్మూర్తి, ఆదినారాయణ, నాగరాజు, నరేష్, రఫీ, మహేష్, తేజస్, లక్ష్మణ్, ఇస్సాక్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటిన అధికారులు

కోదాడ రూరల్, అక్టోబరు 7: మండలంలోని కాపుగల్లు గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అధికారులు సోమవారం మొక్కలు నాటారు. ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలించి ఆక్రమించేందుకు కొందరు యత్నిస్తున్నారని, గ్రామస్థులు కొందరు రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ, మైనింగ్ అధికారులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

తుంగతుర్తి, అక్టోబరు 7: బాల్య స్నేహితుడి కుటుంబానికి మిత్రులు ఆర్థికసాయం అందించారు. మండలంలోని వెలుగుపెల్లి గ్రామంలో 2004-05బ్యాచ్ పదో తరగతి విద్యార్థి షేక్ నబీపాషా ఇటీవల మృతి చెందాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నబీపాషాతో పాటు పదో తరగతి చదువుకున్న మిత్రులు ఆయన భార్యకు రూ.30వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బొల్లం లింగయ్య, ప్రభాకర్, షేక్ అజ్జు, కరుణాకర్, ఉప్పలయ్య, రవీందర్ పాల్గొన్నారు.



నబీపాషా కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

మహా రుద్రాభిషేకం పోస్టర్ ఆవిష్కరణ



నేరేడుచర్లలో రుద్రాభిషేకం పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

నేరేడుచర్ల, అక్టోబరు 7: హుజూర్‌నగర్‌లోని ఎన్ఎస్పీ క్యాంపు ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 27వ తేదీన ఎనిమిది అడుగుల మట్టి శివలింగానికి నిర్వహించే మహా రుద్రాభిషేకాన్ని విజయవంతం చేయాలని కార్యక్రమ నిర్వాహకులు ఓరుగంటి నాగేశ్వరావు, కీత సుధాకర్ కోరారు. ఈ మేరకు సోమవారం నేరేడుచర్లలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాగ సాధువుల ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకం, మహా భస్మాభిషేకం, లక్ష రుద్రాక్షల అభిషేకం మంత్రపుష్పం, నీరాజనాలు, అభిషేకాలు పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల విజయ్, బెల్లంకొండ అమర్, రాచకొండ రామ్మోహన్‌రావు, పాల్వాయి రమేష్, మాశెట్టి సైదయ్య, గోళ్ల సుధాకర్, సోమప్ప ఆలయ కమిటీ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి అమ్మవారి వెండి పాదాల బహూకరణ



లింగాల గ్రామంలో పురోహితుడికి అమ్మవారి వెండి పాదాలను అందజేస్తున్న లచ్చిరెడ్డి-పద్మ దంపతులు

పెన్‌పహాడ్, అక్టోబరు 7: మండలంలోని లింగాల గ్రామంలోని శ్రీకనకదుర్గా దేవాలయానికి హైదరాబాద్‌కు చెందిన తాటికొండ లచ్చిరెడ్డి-పద్మ దంపతులు సోమవారం రూ.20వేల విలువైన వెండి పాదాలు బహూకరించారు. వీటిని ఆలయ పురోహితుడు ఇరువంటి సత్యనారాయణశర్మకు భక్తులతో కలిసి అందజేశారు. దాతలను ఆలయ కమిటీ చైర్మన్ కోటిరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కేసిరెడ్డి శోభ, రంగారెడ్డి, నల్లపు వెంకటేశ్వర్లు, స్వాములు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



నియామకపత్రం అందుకుంటున్న గోగుల శేఖర్‌రెడ్డి

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 7: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. సోమవారం మండలంలోని నెమ్మికల్‌లో ఓఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలకు పెంచుతామని, ఆర్టీసీలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని అమలుచేయలేదన్నారు. అనంతరం భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోగుల శేఖర్‌రెడ్డిని నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుర్ర గోపీయాదవ్, మధుమాదవ్, గుర్రం నరేష్‌రెడ్డి, కొండ సైదులు యాదవ్, వీరమ్మ, వెంకన్న, శివకుమార్, స్వామి, కృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

ఆలయ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతాం



శ్రీరామ మందిర ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న శంభిరెడ్డి

మేళ్లచెర్వు, అక్టోబరు 7: ఆలయ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని మండల కేంద్రంలోని శ్రీరామ మందిర దేవస్థానం ఈవో నాగెండ్ల శంభిరెడ్డి అన్నారు. అనంతగిరి మండలం రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన శంభిరెడ్డి పదోన్నతిపై మేళ్లచెర్వు శ్రీరామ మందిర దేవస్థానం ఈవోగా పదోన్నతి పొందారు. శ్రీరామ మందిర దేవస్థానం అదనపు ఈవో గుజ్జుల కొండారెడ్డి, నాగెండ్ల శంభిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి, నూతన ఈవోను పలువురు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, రాధాకృష్ణమూర్తి, ఎన్. కొండారెడ్డి, భూపాల్‌రెడ్డి, శివాలయం చైర్మన్ శంభిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి, అక్టోబరు 7: జిల్లాలోని ఆరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తొమ్మిది గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి భానునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తేదీ నుంచి 10వ తేదీ వరకు విద్యార్హతలను బట్టి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలను కలెక్టరేట్‌లోని ఇంటర్మీడియట్ కార్యాలయంలో అందించాలన్నారు. సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్, తుంగతుర్తిలో ఓకేషనల్ ఎంపీహెచ్‌డబ్ల్యూ, కోదాడలో ఇంగ్లిష్, కెమిస్ట్రీ, నేరేడుచర్లలో ఓకేషనల్ ఏసీపీ, మ్యాథ్స్, హుజూర్‌నగర్‌లో ఫిజిక్స్, నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు.

దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి



సూర్యాపేటలో అమ్మవారికి మొక్కుతున్న పటేల్ రమేష్‌రెడ్డి దంపతులు



సూర్యాపేటలో పూజల్లో పాల్గొన్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్: దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని సంతోషిమాత దేవాలయంలో సతీమణి లావణ్యతో కలిసి పూజలు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అమ్మవారిని దుర్గామాతగా అలంకరించారు.

● అమ్మవారి కరుణా కటాక్షాలు అందరిపై ఉండాని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 28వార్డు తాళ్లగడ్డలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, పబ్లిక్ క్లబ్ సెక్రెటరీ కొప్పుల వేణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్, కౌన్సిలర్ శీనివాస్‌గౌడ్, జానయ్య, దివ్య పాల్గొన్నారు.



మఠంపల్లిలో అమ్మవారు

నేరేడుచర్ల: పట్టణంలోని శ్రీవిజయదుర్గా దేవాలయంలో అమ్మవారిని ఐదో రోజు శ్రీమహా చండీదేవిగా ఆలయ పూజారి శ్రీనివాసాచార్యులు, శివాలయంలో ఉగ్రదండి శివప్రసాద్‌శర్మలు అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొణతం ఆదిరెడ్డి, రాచకొండ రాంకోటేశ్వరావు, కొణతం చినవెంకటరెడ్డి, నాగండ్ల శ్రీధర్, రాచకొండ రామన్న, కర్రి సూరిబాబు, కొణతం కృష్ణారెడ్డి, ఆరె.కృష్ణారెడ్డి, కట్ట గణేష్, రాము, రాంరెడ్డి పాల్గొనారు.

తిరుమలగిరి: మునిసిపాలిటీలోని క్రాస్‌రోడ్ సమీపంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



నేరేడుచర్ల శివాలయంలో మహాచండీగా దర్శనమిచ్చిన అమ్మవారు

మఠంపల్లి: మండల కేంద్రంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో అమ్మవారిని మహిషాసుర మర్ధనీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.అర్చకుడు సోమయాజుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

మేళ్లచెర్వు: మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు చిన్న శ్రీశైలయాదవ్, ఆలయ ఈవో కొండారెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, అజయ్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, కొండారెడ్డి, నర్సింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: మండల కేంద్రంలోని శ్రీపట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన మండపంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవి అవతారంలో అలంకరించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి 43 రకాల నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో అనురాధ, కిషన్‌రావు, ముత్యాల వెంకటేశ్వర్లు, పెద్దబోయిన అజయ్, అర్చకులు పాల్గొన్నారు.

సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

కోదాడ టౌన్, అక్టోబరు 7: తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని పలువురు అన్నారు. కోదాడ పట్టణంలోని గోపీరెడ్డినగర్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆటపాటలు, కోలాటాలతో నృత్యం చేశారు. . అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొని, గౌరీదేవి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

కోదాడ రూరల్: మండలంలోని రామలక్ష్మీపురం గ్రామంలోని



గోపిరెడ్డినగర్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



రామలక్ష్మీపురంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం చైర్మన్ అన్నం చిన్నవెంకటరెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామలక్ష్మీపురం బతుకమ్మ జాగృతి అధ్యక్షురాలు బేతం పార్వతమ్మ ఆధ్వర్యంలో ఐదో రోజు ఆటపాటలతో బతుకమ్మ సంబురాలు వైభవంగా నిర్వహించారు. జరిపారు. అనంతరం పూజా కార్యక్రమాల్లో గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



సూర్యాపేటఅర్బన్: పందుల బెడద నుంచి పంటలను కాపాడాలని గిరినగర్‌కు చెందిన రైతులు కోరారు. కలెక్టరేట్‌లో తేజస్ నందలాల్ పవార్‌కు వినతిప్రతం అందజేసి మాటాడారు. ఈ విషయాన్ని మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు నర్సింహ, డానియల్ పాల్గొన్నారు.

భానుపురి:ఎల్ఐసీ ఏజెంట్ల కమీషన్ తగ్గించడాన్ని నిరసిస్తూ సూర్యాపేట ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఎల్ఐసీ ఏజెంట్లు నిరసన తెలిపారు. మొదటి సంవత్సరం పాలసీ లాప్స్ అయినా, సరెండర్ చేసినా కొత్త పాలసీల నిబంధన ప్రకారం ఏజెంట్ల నుంచి మొదటి ప్రీమియం కమిషన్‌ను కార్పొరేషన్ వసూలు చేయడం సరికాదన్నారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ అరుణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మట్టపెల్లి గంగయ్యయాదవ్, బైరి రాంమూర్తి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి ఆశయాలు సాధించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, రాము, మల్లయ్య, పర్వతాలు, లాలయ్య, తిరపయ్య, కనకయ్య, రమేష్, గోపాల్ పాల్గొన్నారు.

● పాస్టర్ల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మునిసిపల్ వైఎస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు అన్నారు. పట్టణంలో నిర్వహించిన మండల పాస్టర్ల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు వర్గాలుగా ఉన్న పాస్టర్ల కమిటీ ఒక్కటి కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుధాకర్, పీటర్, డేవిడ్‌రాజు, దేవసహాయం, కృపానందం పాల్గొన్నారు.

గరిడేపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మేదరమెట్ల సీతారామయ్య ఆశయాలను సాధించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు అన్నారు. సీతారామయ్య 27వ వర్ధంతి సందర్భంగా మండలంలోని వెలిదండ గ్రామంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో షేక్ యాకుబ్, పల్లె వెంకటరెడ్డి, సైదులు, పఠాన్ మైబెల్లి, సుశీల లక్ష్మయ్య, పుట్టల లక్ష్మమ్మ, సారెడ్డి సైదిరెడ్డి, అర్జున్ పాల్గొన్నారు.

● ఎవరైనా మొబైల్ పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సీఈఐఆర్ యాప్ ద్వారా కనుగొని అప్పగిస్తామని గరిడేపల్లి ఎస్ఐ చలికంటి నరేష్ అన్నారు. కొన్ని నెలల క్రితం కల్మలచెర్వు గ్రామానికి చెందిన అనంతు ప్రమీల, తడకమల్ల ప్రవీణ్, కాల్వపల్లి గ్రామానికి చెందిన కొల్లి ఆశీర్వాదం కొన్ని నెలల క్రితం ఫోన్ పోగొట్టుకోగా, వారికి ఫోన్లు అందజేసి మాట్లాడారు.

మఠంపల్లి: గ్రామీణ కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి అప్పయ్య అన్నారు. బోనగిరి బాలశౌరయ్య 36వ వర్ధంతిని సందర్భంగా మండల కేంద్రంలోని మండల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బోనగిరి ప్రకాష్‌బాబు, వి.వెంకటరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, వినాయకరాజు, శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

మఠంపల్లి: మండల కేంద్రంలో లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

● గ్రామాల అభివృద్ధికి సాగర్ సిమెంట్స్ యాజమాన్యం అందిస్తున్న సహకారం మరువలేనిదని మఠంపల్లి మాజీ సర్పంచ్ ఆదూరి కిషోర్‌రెడ్డి అన్నారు. సాగర్ సిమెంట్స్ పరిశ్రమ జేఎండీ శ్రీకాంత్‌రెడ్డి చొరవతో మండలంలోని పశువుల ఆస్పత్రి బజారులో రూ.3.30లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం కార్యదర్శి చింతల వీరబాబు పాల్గొన్నారు.

● ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ మంగారాథోడ్ సూచించారు. ఐకేపీ కేంద్రాల ఏర్పాటుపై తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ, సంఘ బంధం, పీఏసీఎస్ అధికారులు, సభ్యులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, సీఈవో తిరుపతయ్య, ఏపీఎం సౌజన్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్:మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమని జమీయతుల్ ఉల్‌మా ఏ హింద్ మత పెద్దలు అన్నారు. సోమవారం కోదాడలో సీఐ రాముకి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అనుచిత వ్యాఖ్యలు చేసి వ్యక్తిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అబ్దుల్ ఖాదిర్‌సాబ్, మౌలానా ముఫ్తి, అతర్ హమీద్, మౌలానా మాజీ కౌన్సిలర్ నయీం, ఎండీ ఖాజా మోహినోద్దిన్, బాగ్దాద్, జహీర్, అలీ, బాజాన్, నజీర్ పాల్గొన్నారు.

చిలుకూరు: గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యే వరకు వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ధ్రువకుమార్ సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సోమవారం వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ, మండల సమాఖ్య అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని కొండాపురం, చిలుకూరు గ్రామాల్లో ఐకేపీల ఆధ్వర్యంలో, బేతవోలు, పాలె అన్నారం గ్రామాల్లో సహకార సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీటీ కరుణశ్రీ, ఆర్ఐలు సీతయ్య, శ్వేత, ఏవో శ్రీధర్, ఏఈవోలు చంద్రశేఖర్, శిరీష, ఏపీయం దుర్గాప్రసాద్, సీసీలు గురుమూర్తి, స్వరూప పాల్గొన్నారు.

తుంగతుర్తి: మండల కేంద్రంలోని సివిల్ సప్లయి గోదాంలో హమాలీల కోసం వందనపు వెంకటేశ్వర్లు తన భార్య పద్మ జ్ఞాపకార్థం ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లును హమాలీలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో యల్లయ్య, శ్యాంసుందర్, రమేష్, నరేష్, రాజేష్ ఉన్నారు.

● పేదల పక్షాన పోరాడేది ఎర్ర జెండాయేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు.మండల కేంద్రంలో ఓరుగంటి అంతయ్య అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, ఉప్పలయ్య, నాయకులు తాటి విజయమ్మ, గడ్డం ఎల్లయ్య, సోమయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.